

బతుకమ్మ ఘాట్ వద్ద ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

నేడే సద్దుల బతుకమ్మ

రూ.28.5 లక్షలతో ఏర్పాట్లు

న్యూస్‌టుడే, సిరిసిల్ల(విద్యానగర్)

తెలంగాణ పూల పండగ సద్దుల బతుకమ్మ వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. సిరిసిల్లలోని మానేరు నదీ తీరంలోని బతుకమ్మ ఘాట్‌లో ఏర్పాట్లు చేశారు. బతుకమ్మఘాట్‌తో పాటు సిరిసిల్ల పట్టణం, విలీన గ్రామాల్లో మొత్తం రూ. 25 లక్షలతో రాతి బుగ్గి, మట్టి పోసి చదును చేశారు. విద్యుత్తు దీపాలతో అలంకరించారు. సిరిసిల్లలో మొత్తం 18 చోట్ల బతుకమ్మ నిమజ్జన కుంటలను ఏర్పాటు చేశారు. బతుకమ్మ ఘాట్‌లో అధికారులు, ప్రముఖులు కూర్చుని వేడుకలను తిలకించేందుకు వేదికను ఏర్పాటు చేశారు. ఏటా మాదిరిగానే క్రాకర్స్ షో ఏర్పాటు చేయనున్నారు. బతుకమ్మ నిమజ్జన పాయింట్ల వద్ద తాగునీటి సౌకర్యానికి ఏర్పాట్లు చేశారు.

☛ ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యం పనులు చేపట్టనున్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. బారికేడ్లు పెట్టారు.

☛ బతుకమ్మ ఆడటానికి వీలుగా తెప్ప ప్రాంతంలో గుంతలున్న ప్రాంతాన్ని మట్టి నింపి చదును చేశారు. సిరిసిల్లతో పాటు విలీన గ్రామాల్లోనూ విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు.



నిమజ్జనానికి ఏర్పాటు చేసిన కొలను

☛ వీధుల్లో గుంతలు పడిన రోడ్లలో మరమ్మతులు చేపట్టారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా...



సిరిసిల్ల పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాం. ముఖ్యంగా గాంధీచౌక్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఎక్కువగా ఉంటుంది. దీంతో ట్రాఫిక్‌ను మళ్లించి వన్‌వే చేస్తాం. భద్రతా చర్యల్లో భాగంగా పలువురు పోలీసులు మఫ్టీలో తిరుగుతారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. **- రమేశ్, ట్రాఫిక్ ఎస్ఐ**

ఇబ్బందులు లేకుండా...



సిరిసిల్లలో సద్దుల బతుకమ్మ వేడుకలకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పట్టణంతో పాటు విలీన గ్రామాల్లో వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

- జిందం కళ, ఛైర్‌పర్సన్, సిరిసిల్ల పురపాలక సంఘం

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: శాంతి భద్రతల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉండే పోలీసులకు క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం అవుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం సిరిసిల్లలోని అంబేడ్కర్ స్టేడియంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోలీస్ వార్షిక క్రీడా పోటీలు ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తుందని తెలిపారు. యువత సన్మార్గంలో నడిచేందుకు గంజాయి రహిత రాష్ట్రంగా తయారు చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూపొందించిన ప్రణాళికలను పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలన్నారు. జిల్లాలో నిఘా నేత్రాల ద్వారా శాంతి భద్రతలను పటిష్ఠం చేస్తున్నామన్నారు. సిరిసిల్లలో 40 సీసీ కెమెరాలను ప్రారంభించినట్లు తెలిపారు. వేములవాడ పట్టణంలో నిఘా నేత్రాలను అవసరమైన మేరకు ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ జిల్లాలో ఎస్పీ మంచి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బందికి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్‌లతో కలిసి వారు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు వెలుముల స్వరూప, పోలీస్ అధికారులు, సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అథ్లెటిక్స్ పోటీల్లో విజేతలతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే సత్యం, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

అదను చూసి బకాయిల వసూళ్లు

చెల్లించకుంటే విద్యుత్తు కనెక్షన్ తొలగింపు

న్యూస్‌టుడే, సిరిసిల్ల కలెక్టరేట్

సహకార విద్యుత్తు సరఫరా సంఘం అధికారులు బకాయిల వసూళ్లను ముమ్మరం చేశారు. భారీగా ఉన్న వాటిని రాబట్టేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే సిబ్బంది రంగంలోకి దిగారు. గత కొన్ని నెలలుగా చెల్లించని వినియోగదారులు విడతల వారీగా చెల్లించేందుకు అవకాశం కల్పించారు. అయినా ముందుకు రాని వారి విద్యుత్తు కనెక్షన్‌ను తొలగిస్తున్నారు. ఇలా మొత్తం బకాయిలు వసూలు చేసి నష్టాలు నుంచి సెస్‌ను గట్టెక్కించేందుకు చర్యలు చేపడుతున్నారు.

● సెస్‌కు చెల్లించాల్సిన బకాయిలు మొత్తం రూ. 139. 75 కోట్లు ఉన్నాయి.

● వివిధ కేటగిరీలకు చెందిన వినియోగదారులు బకాయిలను చెల్లించాల్సి ఉంది. వీరిలో కేటగిరీ-1 కింద అంటే గృహ వినియోగదారులే ఎక్కువగా ఉన్నారు. అన్ని రకాల కనెక్షన్‌లు 2,65,443 ఉండగా, ఇందులో గృహ వినియోగదారులకు సంబంధించినవి 1,64,929 ఉన్నాయి.

కేటగిరీ		బకాయిలు (రూ.కోట్లలో)
గృహ వినియోగదారులు	:	40.38
వాణిజ్యం	:	16.10
పరిశ్రమలు	:	37.75
మరమగ్గాలు	:	1.85
వ్యవసాయం	:	8.83

★ మిగతావి ఇతర వినియోగదారులు కట్టాల్సి ఉంది.



● బకాయిలు వసూలు చేయాలనే లక్ష్యంతో అధిక మొత్తంలో ఉన్న వినియోగదారులు దశల వారీగా చెల్లించేందుకు సెస్ అధికారులు అవకాశం కల్పించారు.

ప్రభుత్వం 200 యూనిట్ల లోపు గృహ విద్యుత్తు వినియోగదారులకు ఉచిత విద్యుత్తును ప్రకటించింది. గృహజ్యోతికి అర్హులుగా ఎంపికైన వారిలో చాలా మంది ఎంపికకాక ముందు చాలా నెలలుగా బిల్లులు చెల్లించలేదు. దీంతో బకాయిలు పేరుకుపోయాయి.

● గృహజ్యోతికి ఎంపికైన వారు ప్రతి నెలా ఉచితంగా విద్యుత్తును పొందుతున్నారు. అయినా పాత బకాయిలు చెల్లించడం లేదు. ఎక్కువ మొత్తంలో బకాయి ఉన్న వారు ఒకేసారి చెల్లించడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి వారు మూడు, నాలుగు విడతల్లో చెల్లించడానికి వీలు కల్పించారు.

● కట్టడానికి ముందుకు రాకపోతే విద్యుత్తు కనెక్షన్ తొలగిస్తున్నారు. దీంతో బకాయిలు చెల్లించే వరకు చీకట్లో ఉంటున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



సెస్‌కు వివిధ కేటగిరీల వినియోగదారుల నుంచి మొత్తం రూ. 139. 75 కోట్ల బకాయిలు ఉన్నాయి. వీరిలో చాలా మంది ఎక్కువ మొత్తంలో కట్టాలి. ఒకేసారి చెల్లించడానికి ఇబ్బందులు పడతారు. దీనికోసం వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా మూడు, నాలుగు విడతల్లో చెల్లించడానికి అవకాశం కల్పించాం. ఈ అవకాశాన్ని బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలి. బకాయిలు కట్టని వారి విద్యుత్తు కనెక్షన్‌ను తొలగిస్తాం.

- శ్రీనివాసరెడ్డి, సెస్ ఎండీ

కార్మికుల పిల్లలు... ఇక గురువులు



వీరంతా పేద, మధ్య తరగతి కుటుంబాల నుంచి వచ్చిన వారు. పట్టుదలతో శ్రమిస్తే సాధించలేనిదంటూ ఏదీ లేదని నిరూపించారు. ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడాలనుకునే వీరి ఆకాంక్ష నేటితో నెరవేరింది. 2024 డీఎస్సీ ఫలితాల్లో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన పలువురు యువకులు ఉన్నత స్థానాల్లో నిలిచారు. – ఈనాడు, యంత్రాంగం

కష్టానికి ఫలితం దక్కిందని ఆనందం

కార్ఖానాలో పని చేస్తూనే...



నాన్న నేత కార్మికుడు, అమ్మ బీడీలు చుడుతోంది. అన్నయ్య, చెల్లెలు, నేను ముగ్గురం సంతానం. కార్ఖానాలో పని చేసుకుంటూ ఇంటర్, డిగ్రీ, డీఈడీ వరకు చదివాను. జిల్లా గ్రంథాలయంలోనే డీఎస్సీకి సన్నద్ధమయ్యాను. సరైన ప్రణాళిక, పాఠ్యాంశాలపై పట్టుసాధించాను. రెండో ప్రయత్నంలో ఎస్జీటీలో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించాను.

- అలిశెట్టి శ్రీకాంత్

మొక్కవోని దీక్షతో...



చిన్నతనంలోనే తల్లి లలిత అనారోగ్యంతో మృతి చెందింది. ఓవైపు విద్యావాలంటీర్‌గా పని చేస్తూ డిగ్రీ పూర్తి చేశాను. తండ్రి రాజబాబు సైతం అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో తండ్రి నడిపిస్తున్న బీడీ కంపెనీ బాధ్యతలను చూసుకుంటూ దూరవిద్యలో ఎంఏ తెలుగు పూర్తి చేశాను. డీఎస్సీలో తెలుగు పండిట్ విభాగంలో జిల్లాలో రెండో ర్యాంకు సాధించాను. **- కార్తీక్, నిమ్మపల్లి**

మూడేళ్లుగా...



నాన్న వాయిద్య కళాకారుడు. అమ్మ బీడీలు చుడుతోంది. మాది మధ్య తరగతి కుటుంబం. డీఈడీ పూర్తయ్యాక మూడేళ్లు హైదరాబాద్‌లో ఉంటూ ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యాను. చిన్నప్పటి నుంచే ఉపాధ్యాయ వృత్తి అంటే ఇష్టం. దాంతో సొంతంగా డీఎస్సీ చదివి ఎస్జీటీలో జిల్లాలో ఆరో ర్యాంకు సాధించడం సంతోషంగా ఉంది.

- శ్రీరాముల మౌనిక

తల్లి, భార్య ప్రోత్సాహంతో...



పదిహేనేళ్లుగా ఉపాధ్యాయ ఉద్యోగానికి సన్నద్ధమయ్యాను. 2012 డీఎస్సీలో ఒక మార్కు, 2018లో 0.5 మార్కుతో ఉద్యోగాన్ని కోల్పోయాను. ఆ తర్వాత ఇంటి వద్ద వ్యవసాయ పనులు చేసుకుంటున్నాను. కరీంనగర్ గ్రంథాలయంలో సొంతంగా డీఎస్సీకి సన్నద్ధమయ్యాను. కరీంనగర్ జిల్లాలో ఎస్జీటీగా రెండో ర్యాంకు సాధించాను.

- ఆజ్మీరా తిరుపతి, గర్జనపల్లి

రెండింటికి ఎంపికైనా...



డిగ్రీ తర్వాత డీఈడీ పూర్తి చేశాను. చాలా రోజులు సిరిసిల్లలోని ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేశాను. ఆ తరవాత అది మానేసి ట్యూషన్స్ చెబుతూ ఇంటి వద్దే రెండు సంవత్సరాలుగా డీఎస్సీకి సన్నద్ధం అయ్యాను. ఈసారి ఎస్జీటీలో జిల్లాలో రెండో ర్యాంకు సాధించాను. ఇటీవల విడుదలైన గ్రూప్-4 ఫలితాల్లోనూ జనరల్ విభాగంలో ఉత్తీర్ణత సాధించాను. **- పాముల రాజేందర్**

గ్రంథాలయంలో చదివి..



మా నాన్న నా చిన్నతనంలోనే చనిపోవడంతో అమ్మ బీడీలు చుడుతూ ముగ్గురు అక్కలను చదివించి వివాహాలు చేసింది. డీఈడీ పూర్తయ్యాక ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేశాను. రెండేళ్లుగా జిల్లా గ్రంథాలయంలో డీఎస్సీకి సొంతంగా సన్నద్ధమయ్యాను. డీఎస్సీలో జిల్లాలో 8వ ర్యాంకు సాధించాను.

- బొల్లి నవీన్ కుమార్

ఒకేసారి మూడు కొలువులు



2020లో జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సాధించి ఇల్లంతకుంట మండలంలో పని చేస్తున్నాను. టీచర్ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో డీఎస్సీకి చదివి ఎస్జీటీగా ఎంపికయ్యాను. టీఎస్‌పీఎస్సీ గ్రూప్-4లో జిల్లాలో 40వ ర్యాంక్, 2024 ఆగస్టులో రైల్వే గ్రూప్-డి ఉద్యోగం సాధించాను. రెండు నెలల వ్యవధిలోనే మూడు ఉద్యోగాలు సాధించాను. **- దాసరి ప్రశాంత్**

కులవృత్తి చేస్తూనే...



కుల వృత్తి వడ్రంగి పని చేస్తూనే అంబేడ్కర్ యూనివర్సిటీ ద్వారా దూరవిద్యలో డిగ్రీ పూర్తి చేశాను. తరవాత సిరిసిల్లలో బీఈడీ చదివాను. డీఎస్సీలో సాంఘిక శాస్త్రం విభాగంలో జిల్లాలో రెండో ర్యాంకు సాధించాను. ఓవైపు కులవృత్తి చేస్తూనే, మరోవైపు విద్యను కొనసాగించి సర్కారు కొలువు సాధించాను.

- స్తంభంపల్లి శ్రీనివాస్, శివంగళపల్లి

హైదరాబాద్‌కు తరలిన ఉపాధ్యాయ అభ్యర్థులు



వాహనాలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లో బుధవారం నియామక పత్రాలను అందజేశారు. జిల్లాలో ఎంపికైన 130 మందిని జిల్లా యంత్రాంగం అక్కడికి తరలించింది. అభ్యర్థులు వెళ్లే వాహనాలను అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఎంపికైన వారికి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, భాషా పండితులు, పీఈటీ, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు మొత్తం కలిసి 130 మంది అర్హత సాధించారని వెల్లడించారు. వీరందరికీ హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జిల్లాకు ఏర్పాటు చేసిన కౌంటర్‌లో జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ నియామకపత్రాలను అందజేశారు.

రాజన్న ఆలయానికి రూ. 3.50 కోట్ల ఆదాయం

పలు దుకాణాల నిర్వహణకు టెండర్లు



టెండర్లు నిర్వహిస్తున్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, అధికారులు

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన పలు విభాగాల్లో దుకాణాల నిర్వహణకు రెండేళ్ల పాటు హక్కులు పొందేందుకు బుధవారం ఆలయ అధికారులు టెండర్లు నిర్వహించారు. ఆలయానికి రూ. 3.50 కోట్ల ఆదాయం సమకూరింది. గత ఏడాది కంటే ఎక్కువ మొత్తంలో వేలం పాడి టెండర్లు దక్కించుకున్నారు. ఈ మేరకు ఆలయ ఓపెన్ స్లాబ్‌లో ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు దాదాపు 14 విభాగాలకు సంబంధించి ఆన్‌లైన్, పేపర్, బహిరంగ టెండర్లు నిర్వహించారు. రెండింటికి ఎవరు హాజరు కాకపోవడంతో వాటిని నిలిపివేశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

పొగాకు వాడకాన్ని నివారించేందుకు చర్యలు

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో పొగాకు వాడకం నివారించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో పొగాకు వాడకం నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. పొగాకు నియంత్రణ కార్యక్రమానికి సంబంధించి వివిధ శాఖల వారు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత పొగాకు వాడకం నివారించేందుకు జాతీయపొగాకు ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 2.0 కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. కళాకారుల ద్వారా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం. వసంతరావు, డీఐఈవో శ్రీనివాస్, కార్మిక అధికారి నజీర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభం

వేములవాడ, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైనట్లు వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ తెలిపారు. బుధవారం కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల మార్పిడి, కొత్తవి ఏర్పాటుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ నియోజక వర్గానికి సంబంధించిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల కోసం ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైనట్లు చెప్పారు. 01.11.2024 నాటికి డిగ్రీ చదివి మూడేళ్లు పూర్తయినవారు ఫారం 18 ద్వారా, ఉపాధ్యాయులు ఫారం 19 ద్వారా ఓటరు నమోదుకు 06.11.2024 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీవో రాజేశ్వర్

అందని సీడీపీ నిధులు.. సాగని పనులు



ఈ ఏడాదిలో విడుదల ఊసే లేదు

ఈనాడు, కరీంనగర్

ఉమ్మడి జిల్లాకు ఈ వార్షిక సంవత్సరం (2024-25)లో రావాల్సిన నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం (సీడీపీ) నిధుల ఊసే లేదు. దీంతో నాలుగు జిల్లాల పరిధిలో గెలిచిన ఎమ్మెల్యేలు.. చేపట్టాల్సిన ప్రగతి పనుల విషయంలో మల్లగుల్లాలు పడుతున్నారు. గతేడాది నవంబరులో జరిగిన ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు తోడుగా.. కొత్త పనుల కోసం వెచ్చించాల్సిన నిధులు ఇంకా రాకపోవడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు పెరుగుతున్నాయి. గ్రామాలు, పట్టణాల నుంచి ఎమ్మెల్యేలకు పలు అభివృద్ధి పనులకు సంబంధించి దండిగా ప్రతిపాదనలు అందుతున్నాయి. ఇటీవల వరదల కారణంగా చాలాచోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. వాటికి సంబంధించిన ప్రతిపాదనలకు కూడా ప్రత్యేక ప్యాకేజీ రాకపోవడంతో కళ్లముందు కనిపిస్తున్న పనులకు నిధులను ఏ విధంగా సమకూర్చాలనేది అటు అధికారులకు.. ఇటు నియోజకవర్గ ప్రజాప్రతినిధులకు సమస్యగా మారింది.

రాష్ట్రం ఏర్పాటయ్యాక రెండింతలు..

కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమం (ఎస్‌డీపీ) నిధి పేరిట ప్రతి శాసనసభ నియోజకవర్గానికి రూ. 10 కోట్ల చొప్పున మంజూరు చేసింది. దీనికి అదనంగా సీడీపీ నిధులు కూడా అందితే ఎమ్మెల్యేలకు వచ్చే వినతులకు మోక్షం లభించేది. నియోజకవర్గ అభివృద్ధి నిధి ద్వారా ప్రస్తుతం రూ. 5కోట్ల చొప్పున రావాలి. ఉమ్మడి రాష్ట్రంలో ఏటా రూ. 50 లక్షలు మాత్రమే ఇచ్చేవారు. తరువాత కొన్నాళ్లకు రూ. 75 లక్షలు ఆ తరువాత రూ. కోటి యాభై లక్షలకు పెంచారు. తెలంగాణ ఏర్పాటయ్యాక రెండింతలు చేశారు. 2018 నుంచి రూ. 5 కోట్లను అందిస్తూ వస్తున్నారు.



రంగంపేటలో చిత్తడిగా మారిన పొలాలకు వెళ్లే దారి

రూ.120 కోట్లపైనే ఆశలు..

గతేడాది నవంబరులో ఎన్నికలు జరగడం డిసెంబరులో కొత్త ప్రభుత్వం ఏర్పాటవడంతో ఎమ్మెల్యేల విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి ఈ ప్రత్యేక అభివృద్ధి నిధిని అన్ని నియోజకవర్గాలకు కేటాయించారు. ఇలా 12 నియోజకవర్గాలకు రూ. 10కోట్ల చొప్పున వచ్చిన రూ. 120 కోట్లను వినియోగించడంపైనే ప్రస్తుతం అందరూ దృష్టి సారిస్తున్నారు. వీటిని పాత పనులకు పెట్టకూడదనే నిబంధనను అమలు చేస్తున్నారు. ఇందులో నుంచి తాగునీటికి రూ. కోటి, బడుల్లో మౌలిక వసతుల కోసం రూ. 2 కోట్లు ప్రతి ఎమ్మెల్యే ఖర్చు చేయాలి. అంతేకాకుండా కలెక్టర్, జిల్లా అధికారుల ప్రతిపాదనలతో ప్రభుత్వ భవనాల మరమ్మతులకు రూ. 50 లక్షలు విధిగా కేటాయించాలి. మిగిలిన రూ. 6.5 కోట్లను ఇతర అభివృద్ధి పనులకు వెచ్చించాలి.

అన్నింటికీ ఎస్‌డీపీ నిధులే ఆధారం..

12 నియోజకవర్గాల పరిధిలో కొత్తగా ఈ ఏడాదిలోనే 1500కు పైగా ప్రతిపాదనలు అందినట్లు అధికారులు చెబుతున్నారు. వీటన్నింటికి ఎస్‌డీపీ నిధులే ఆధారమవుతున్నాయి. ప్రతి పనికి ఇన్‌ఛార్జి మంత్రి అనుమతితోనే నిధులు విడుదల చేయాల్సి ఉండటంతో ఇబ్బంది ఏర్పడుతోంది. పూర్తిస్థాయిలో నిధులు రాకపోవడంతో అందిన ప్రతిపాదనలకు ఎమ్మెల్యేలు న్యాయం చేయలేకపోతున్నారు. మరోవైపు కార్యాలయాలకు వచ్చిన ప్రతిపాదనల్లో వేటికి ప్రాధాన్యత నివ్వాలనేది యంత్రాంగానికి తలనొప్పిగా మారుతోంది.





కొనుగోలుదారులతో మార్కెట్ కిటకిట

సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: సిరిసిల్లలో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలు జరగనున్నాయి. ఈ సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రం పూల కొనుగోలుదారులు, విక్రయదారులతో కిటకిటలాడింది. సిరిసిల్లలోని అంబేడ్కర్‌చౌక్ నుంచి మార్కెట్ ఏరియా, బతుకమ్మఘాట్ వరకు సందడిగా మారింది.

మేమున్నాం.. మీకు తోడుగా... (10 AM TO 1 PM) వీర్నపల్లి: 91541 18151 బోయినపల్లి: 84999 90001

బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

వీర్నపల్లి, న్యూస్‌టుడే: వీర్నపల్లి మండల కేంద్రంతోపాటు రంగంపేట, మద్దిమల్ల, కంచర్ల, గర్జనపల్లి తదితర గ్రామాల్లో బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లను బుధవారం తహసీల్దార్ మారుతిరెడ్డి పరిశీలించారు. చెరువుల వద్ద విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లోతును సూచించే విధంగా సూచికలు, అవసరమైతే గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఘురాం, పంచాయతీ కార్యదర్శులు పురుషోత్తం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


వీర్నపల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ మారుతిరెడ్డి


నమాజ్ చెరువు వద్ద చదును చేసిన దృశ్యం

ముస్తాబాద్: బతుకమ్మ పండగకు మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది బుధవారం ఏర్పాట్లు చేశారు. చెరువు కుంటల వద్ద పిచ్చి మొక్కలు తొలగించారు. భూమి చదునుతోపాటు విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. బతుకమ్మ నిమజ్జనానికి మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు ఆయా గ్రామాల కార్యదర్శులు పేర్కొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఉండటంతో పంచాయతీ అధికారులు స్థానిక చెరువుల వద్ద మహిళలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లను శుభ్రం చేశారు. చెరువుల వద్ద, వెళ్లే దారిలో గడ్డిని తొలగించారు. ఆడుకోవడానికి అనువుగా స్థలాలను చదును చేశారు. విద్యుత్తు దీపాలు అమర్చారు. ఎంపీవో రాజేశ్వర్‌తో పాటు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పనులను పర్యవేక్షించారు. గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు చేశామని ఎంపీవో రాజేశ్వర్ తెలిపారు.


కొండాపూర్‌లో...

పూలకు భారీ గిరాకీ

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: బతుకమ్మ పండగ రోజు పూలను కూడా పూజించడం ఆనవాయితీ. గత మూడు నాలుగు సంవత్సరాల క్రితం పండగకు ఒకరోజు ముందుగానే గ్రామ శివారు ప్రాంతాల్లోని బీడు భూములు, సమీప అడవులకు వెళ్లి, కావాల్సినంత గునుగు, తంగేడు పూలను సేకరించేవారు. క్రమంగా బీడు భూముల విస్తీర్ణం తగ్గిపోవడంతో గునుగు, తంగేడు చెట్లు కనుమరుగవుతున్నాయి. ఎక్కడ చూసినా బతుకమ్మను పేర్చేందుకు ప్రధాన పూలు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో గునుగు, తంగేడు పూలకు డిమాండ్ విపరీతంగా పెరిగిపోయింది. మారుమూల అటవీ గ్రామాలకు చెందిన వారు గునుగు, తంగేడు పూలను సేకరించి, పట్టణాలు, నగరాలు, ప్రధాన మండలాలకు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ఇప్పుడు ఇది పల్లెలకూ పాకింది. చాలా మంది జనం గునుగు, తంగేడు పూలను కొనుగోలు చేసేందుకు పోటీ పడుతున్నారు. పూల విక్రేతలు ఎక్కడపడితే అక్కడ, రోడ్లపై అమ్ముతుండటంతో రాచర్ల గొల్లపల్లి బస్టాండు ప్రాంతాల్లో బుధవారం తీవ్ర రద్దీ నెలకొంది. దసరా సమీపిస్తున్న తరుణంలో వస్త్ర దుకాణాలకు భారీ గిరాకీ ఏర్పడింది. కనీసం ద్విచక్రవాహనాలు వెళ్లలేనంతగా జనసంచారం పెరిగిపోయింది.


రాచర్ల గొల్లపల్లి బస్టాండు ప్రాంతంలో పూల విక్రయాలతో నెలకొన్న రద్దీ

ఉపాధ్యాయుడికి పరామర్శ

రాచర్ల బొప్పాపూర్ (ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు మారుపాక రాజును భారాస రాష్ట్ర నేత ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. మారుపాక రాజుకు గత నెల 20న ఫిట్స్ రావడంతో ఆసుపత్రిలో చికిత్స పొంది, ఇంటికి చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న ప్రవీణ్‌కుమార్ నేరుగా అతని ఇంటికి వెళ్లి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. స్వేరోస్ నెట్‌వర్క్‌లో మారుపాక రాజు పట్టుదలగా పనిచేశారని పేర్కొన్నారు. అనారోగ్యం బారిన పడినప్పుడు ధైర్యంగా ఉండాలని, ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. ప్రవీణ్‌కుమార్‌ను పలువురు భారాస నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్వేరోస్ నెట్‌వర్క్ ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయుడిని పరామర్శిస్తున్న ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల వితరణ

రాచర్ల గొల్లపల్లి(ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: బతుకమ్మ, దసరా పండగలు పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లికి చెందిన 15 మంది పారిశుద్ధ్య కార్మికులకు రాచర్ల బొప్పాపూర్ ఏఎంసీ మాజీ ఛైర్మన్, భారాస నేత కొండ రమేశ్‌గౌడ్, రేణుక దంపతులు బుధవారం నూతన దుస్తులను వితరణ చేశారు. పండగ పూట ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో దుస్తులను అందించి ఔదార్యం చాటుకున్నారు. తమకు దుస్తులను పంపిణీ చేయడంపై పారిశుద్ధ్య కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.


దుస్తులు అందిస్తున్న నాయకులు

ఆటో డ్రైవర్ నిజాయతీ

కోనరావుపేట, న్యూస్‌టుడే: కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ పిల్లి వెంకటేశం బుధవారం నిజాయతీ చాటుకున్నాడు. మండలంలోని రామన్నపేటకు చెందిన కట్కూరి లక్ష్మికి చెందిన పట్టీలు (పట్ట గొలుసులు) 20 తులాలు చంద్రంపేటలో పడిపోయాయి. ప్రయాణికులతో వెళ్తున్న ఆటో డ్రైవర్ రోడ్డుపై పడిపోయిన వాటిని గుర్తించి తీసుకున్నాడు. బాధితురాలి చిరునామా తెలుసుకుని మండల కేంద్రానికి రప్పించి అందజేశారు. నిజాయతీ చాటుకున్న ఆటో డ్రైవర్‌ను జై హనుమాన్ ఆటో యూనియన్ నాయకులు, పలువురు అభినందించారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు


చందుర్తిలో అన్నదానం


చందుర్తిలో భారాస నాయకులు..


ముస్తాబాద్‌లో పూజలు


సిరిసిల్ల: వెంకంపేటలో...


సర్దార్‌నగర్‌లో...

శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా గ్రామాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల్లో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఒడి బియ్యం సమర్పించి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

\- న్యూస్‌టుడే బృందం


నాగారంలో...


గాంధీనగర్‌లో అన్నదానం


వెంకట్రావుపల్లిలో...

మర్త్ అండ్ మిజరీ పుస్తకావిష్కరణ

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కొండ మురళి రాసిన మర్త్ అండ్ మిజరీ పుస్తకాన్ని కరీంనగర్‌లో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. కొండ మురళి మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో పీజీటీగా పని చేస్తున్నారు. ఇంతకు ముందు ఆయన అనేక ఆంగ్ల సాహిత్య పుస్తకాలను రచించారు. ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ కొండ మురళి రచనలు జీవితంలోని ఆనందాలు, కష్టాలను ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. పాఠకులకు లోతైన ఆలోచనలు ఉద్భవిస్తాయని పేర్కొన్నారు. మర్త్ అండ్ మిజరీ అనే నాలుగు ఆకర్షణీయ నవలల సమాహారం పాఠకులను అమితంగా ఆకట్టుకుంటుందని చెప్పారు. ఈ పుస్తకం అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లలో అందుబాటులో ఉన్నాయన్నారు. మున్ముందు మరిన్ని ఆంగ్ల సాహిత్య, నవలల పుస్తకాలను రచించి, విజయం సాధించాలని ఆకాంక్షించారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యం

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ రాష్ట్ర ఛైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం సిరిసిల్లలోని జిల్లా కోర్టులో న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ బుర్ర రవితేజ, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సంజీవరెడ్డిలు పుష్పగుచ్ఛం అందజేసి ఆయనను శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ న్యాయవాదులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, జూనియర్ న్యాయవాదుల సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ జిల్లా నాయకులు కల్యాణ చక్రవర్తి, గుర్రం ఆంజనేయులు, ధర్మేందర్, గోవర్ధన్ రెడ్డి, పసుల కృష్ణ, గొడిశెల భగవాన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


అశోక్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, న్యాయవాదులు

నిధుల మంజూరుకు కేంద్ర సహాయ మంత్రికి వినతి

గంభీరావుపేట, న్యూస్‌టుడే: గంభీరావుపేట మండలం ముస్తఫనగర్ గ్రామానికి చెందిన పలు కుల సంఘాల నాయకులు, భాజపా మండల ప్రధాన కార్యదర్శి దొమకొండ కృష్ణ కాంత్‌లు బుధవారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిశారు. పలువురు కుల సంఘాల భవనాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా గ్రామంలో ఉన్న హనుమాన్ ఆలయం శిథిలావస్థలో ఉందని దాని పునర్నిర్మాణానికి నిధులు కేటాయించాలని కృష్ణ కాంత్ కోరారు. త్వరలోనే నిధులు మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.


బండి సంజయ్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

గడి మైసమ్మ షెడ్డు నిర్మాణానికి వితరణ

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: ఇల్లంతకుంట మండలంలోని పెద్దలింగాపూర్‌లోని గడి మైసమ్మ గుడి ఆవరణలో షెడ్డు నిర్మాణానికి మాజీ సర్పంచి గొడిశెల జితేందర్‌గౌడ్ రూ.50వేలు ఆర్థిక సాయం అందించి షెడ్ నిర్మించగా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు జితేందర్‌గౌడ్‌ను అభినందించారు.

ఎనిమిది మంది ముందస్తు బైండోవర్

ముస్తాబాద్, న్యూస్‌టుడే: గత దసరా వేడుకల్లో అల్లర్లకు పాల్పడ్డ ఎనిమిది మందిని ముందస్తుగా తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు ఎస్సై గణేశ్ బుధవారం తెలిపారు. బతుకమ్మ, దసరా వేడుకలను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడినా, మహిళలను వేధించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలీసులు సాధారణ దుస్తుల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారన్నారు.

ఇందిరమ్మకాలనీలో హైమాస్ట్ దీపాలు ప్రారంభం

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీలో కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం మధుకర్‌తో కలిసి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాల్గం ప్రవీణ్‌కుమార్ బుధవారం హైమాస్ట్ దీపాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కేకే మహేందర్‌రెడ్డి సహకారంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. సిరిసిల్ల ఏఎంసీ వైస్ ఛైర్మన్ నర్సింగంగౌడ్, సేవాలాల్ జిల్లా అధ్యక్షుడు రాజు, నాయకులు పాల్గొన్నారు.

తుపాకీతో ఫొటో దిగి... సామాజిక మాధ్యమంలో పెట్టి యువకుడి అరెస్టు

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన అక్కెం హరికృష్ణ అనే యువకుడిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. హరికృష్ణ తుపాకీ కలిగి ఉండటంతోపాటు దానితో ఫొటో దిగి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

మీడియా పేరుతో అక్రమాలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

నేర వార్తలు

వేములవాడ, న్యూస్‌టుడే: మీడియా పేరుతో అక్రమాలకు పాల్పడిన వ్యక్తిని బుధవారం అరెస్టు చేసినట్లు వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం... వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రుద్రవరం ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన ఎండీ యూసుఫ్ గత కొన్ని సంవత్సరాల నుంచి నేషనల్ ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో పని చేస్తున్నానని చెప్పి చొక్కాల వనజ, పీసరి శ్రీనివాస్‌ల ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో విలేకరిగా చేర్పించి అక్రిడేషన్ కార్డులు ఇప్పిస్తానని చందుర్తి మండలంలోని మల్యాలకు చెందిన రొండి చంద్రయ్యను మోసం చేశాడు. ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రకాల సౌకర్యాలు పొందవచ్చని, రెండు పడక గదుల ఇల్లు కూడా ఇప్పిస్తానని నమ్మించి డబ్బులు వసూలు చేశాడు. ఇదే మండలంలోని రామన్నపేటకు చెందిన ఆరుట్ల ఆది మల్లయ్యకు అసైన్డు భూమి ఇప్పిస్తానని చెప్పి డబ్బులు వసూలు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు చందుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా గతంలో వనజ, శ్రీనివాస్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న యూసుఫ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ వెల్లడించారు.

మద్యం దుకాణంలో చోరీ

గంభీరావుపేట, న్యూస్‌టుడే: మద్యం దుకాణంలో చోరీ జరిగిన సంఘటన గంభీరావుపేట మండలంలోని లింగన్నపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... లింగన్నపేటలోని ఎల్లమ్మ మద్యం దుకాణం షట్టర్ బుధవారం కొద్దిగా లేపి ఉంది. దీనిని చూసిన పర్మిట్‌రూమ్ నిర్వాహకుడు వెంటనే దుకాణం యజమాని సాయికి సమాచారం అందించాడు. వెంటనే అతను వచ్చి పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి కౌంటర్‌లో ఉన్న రూ.10 వేల నగదుతోపాటు ఒక చరవాణి, నాలుగు మద్యం ఫుల్ బాటిళ్లు ఎత్తు కెళ్లాడని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సీఐ శ్రీనివాస్, ఎస్సై శివకుమార్‌లు వెళ్లి పరిశీలించారు. సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న లారీని బుధవారం వేములవాడ గ్రామీణ పోలీసులు పట్టుకున్నారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఊటూరు ఇసుక రీచ్ నుంచి హైదరాబాద్‌కు పర్మిట్ తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా వేములవాడ గ్రామీణ మండలం హన్మాజీపేటలో అధిక ధరకు విక్రయిస్తుండగా పట్టుకున్నారు. ఈ మేరకు లారీ డ్రైవర్ సత్తయ్యపై కేసు నమోదు చేసి లారీని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మారుతి తెలిపారు.

చోరీ కేసులో ఒకరికి జైలు, జరిమానా

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: చోరీ కేసులో ఒకరికి జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశేణి న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... సిరిసిల్ల పట్టణ పరిధిలోని పెద్దబోనాలకు చెందిన బైరగోని శ్రీనివాస్‌కి బైపాస్ రోడ్డులో టిఫిన్ సెంటర్ ఉంది. 2023 డిసెంబర్ 11న అందులో చోరీ జరిగిందని సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి పెద్దపల్లి జిల్లా బ్రాహ్మణపల్లికి చెందిన మడక చిరంజీవిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితుడికి జడ్జి ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.100 జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు.

గంజాయి కేసులో...

సిరిసిల్ల గ్రామీణం: గంజాయి కేసుల్లో ఒకరికి జైలు శిక్ష, మరో ఇద్దరికి జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్ బుధవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... వేములవాడ మండలం నాంపల్లికి చెందిన జాన్ ప్రతాప్‌రెడ్డి, వడిచెర్ల వనిత, బొమ్మల ఆంజనేయులు (అనుపురం)పై రెండు గంజాయి కేసులు ఉన్నాయి. 2023 సంవత్సరంలో వీరిని రిమాండ్‌కు తరలించారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితుడు జాన్ ప్రతాప్‌రెడ్డికి 10 నెలల జైలు శిక్ష, వడిచెర్ల వనిత, బొమ్మల ఆంజనేయులుకు రూ.2 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు పేర్కొన్నారు.

విద్యుత్తు నియంత్రిక ప్రారంభం

సిరిసిల్ల అర్బన్, న్యూస్‌టుడే: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఇప్పలపల్లిలో నూతన విద్యుత్తు నియంత్రికను బుధవారం సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ చెన్నమనేని కీర్తి, 9వ వార్డు కౌన్సిలర్ సత్యనారాయణ, పీఏసీఎస్ ఛైర్మన్ కిషన్, డైరెక్టర్ బాలరాజు, కమలాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలు


మండెపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమంలో బతుకమ్మ ఆడుతున్న వృద్ధులు, మహిళలు


జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో...

జిల్లాలో పలుచోట్ల బుధవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ప్రధాన కూడళ్లలో ఉంచి ఆడిపాడారు. కోలాటం ఆడుతూ సందడి చేశారు. అనంతరం సమీపంలోని నీటి వనరుల్లో నిమజ్జనం చేశారు.

\- న్యూస్‌టుడే బృందం


సిరిసిల్ల: ఆర్టీసీ డిపోలో...

బసపా అధికారంలోకి రావడమే లక్ష్యం

బోయినపల్లి, న్యూస్‌టుడే: బసపాను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నల్లాల శ్రీనివాస్ పేర్కొన్నారు. మాజీ మండల కన్వీనర్ పెగ్గర్ల మహేందర్ ఆధ్వర్యంలో కాన్షీరాం వర్ధంతిని బోయినపల్లిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయడంతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి సత్తాచాటేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి బాలకిషన్, చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజు, సీనియర్ నాయకుడు మహంకాళి తిరుపతి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు మహేశ్, రాజయ్య, శేఖర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


సిరిసిల్ల వస్త్ర వ్యాపార సంఘంలో...


సిరిసిల్ల అర్బన్: బీఎస్పీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్లలోని చేనేత, వస్త్ర వ్యాపార సంఘంలో కాన్షీరాం వర్ధంతిని నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి ఎనగదుల వెంకన్న, జిల్లా అధ్యక్షుడు చాకలి రమేశ్, మునిందర్, తడుక భాను, అరుకుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సుద్దాల (కోనరావుపేట): కోనరావుపేట మండలం సుద్దాలలో కాన్షీరాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు దొబ్బల స్వామి, మాజీ ఉప సర్పంచి నాగరాజు, భీం ఆర్మీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, సుమన్, ఆంజనేయులు, డి.దేవయ్య, ప్రదీప్‌కుమార్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.


బోయినపల్లిలో నివాళులర్పిస్తున్న బసపా నాయకులు

■ బతుకమ్మ పాటల్లో ప్రాచీన సౌందర్యం
■ భావి తరాలకు అందిస్తున్న అక్షర శ్రామికులు

సాహితీ విరులు.. సాంస్కృతిక సిరులు



బతుకమ్మ పుస్తకాలు

అతివలు ఆనందంగా జరుపుకొనే బతుకమ్మ పండుగ సాంస్కృతిక వారధిగా నిలుస్తోంది.. పూజలకు వినియోగించే పూలనే కొలిచే వేడుక జానపదుల జీవన సౌందర్యానికి అద్దం పడుతోంది.. ఆచార వ్యవహారాలు, పల్లె వాసుల కష్టాలను ప్రతిబింబించేలా అలతి పదాలతో మహిళల నోటి నుంచి జాలువారే పాటలు నేటి తరానికి ప్రాచీన సంప్రదాయాలను అందిస్తున్నాయి.. శతాబ్దాల కిందటి చరిత్రను నేటి తరాలకు అందించడం వెనుక ఎంతో మంది గాయనీమణులతో పాటు సాహితీవేత్తల కృషి దాగి ఉంది..

న్యూస్‌టుడే, కరీంనగర్ సాంస్కృతికం

మారుతున్న కాలంతో పాటే పండుగ నిర్వహణలో ఎన్నో మార్పులు వచ్చినా బతుకమ్మ పాటల్లో ఒకే రకమైన సాహిత్యం, రాగం శతాబ్దాలుగా పడతుల నోళ్లలో నానుతోంది. ఎంగిలిపూలతో ఆరంభమై సద్దులతో ముగిసే వేడుకను రోజుకో పేరుతో ఆడుకోవడం తెలంగాణకే ప్రత్యేకంగా నిలిచింది. వందల ఏళ్ల కిందట పుట్టిన గీతాలు వారసత్వ సంపదగా వస్తున్నాయి.

ప్రకృతి ఆరాధన

■ బతుకమ్మ పాట ఆరంభంలో పంచ భూతాలను తలచుకోవడం ప్రకృతి ఆరాధనకు అద్దం పడుతుంది.

■ సూర్యచంద్రులు, భూమి, గంగ, ఇష్ట దేవతలు, కుల దైవాలు, ఇలవేల్పుల పాటల్లో స్తుతి కనిపిస్తుంది. ఇది ప్రాంతాన్ని బట్టి మారుతుంది. మన ప్రాంతంలో వేములవాడ రాజన్న, కొమురవెల్లి మల్లన్న, రాముడిని, కృష్ణుడిని తలచుకుంటూ పాడుకుంటారు.

■ పండుగ పుట్టు పూర్వోత్తరాలను తెలిపే అంశాలను అనాదిగా బతుకమ్మ పాటలుగా అల్లుకున్నారు.

■ లక్ష్మీదేవిని, పార్వతీదేవిని పేరంటాలుగా, ప్రకృతికి రూపంగా భావిస్తూ పాటల్లో వల్లె వేస్తారు.

పుట్టుకపై భిన్న కథలు

క్రీ.శ.16వ శతాబ్దానికి చెందిన భట్టు నరసింహ కవి రాసిన 'శ్రీలక్ష్మి దేవి ఉయ్యాలో.. సృష్టి బతుకమ్మయ్యే ఉయ్యాలో..' అంటూ సాగే పాట రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రాచుర్యంలో ఉంది. ఈ పాటలోనే బతుకమ్మ పుట్టు పూర్వోత్తరాలు వివరించారు. చోళ దేశ రాజు ధర్మాంగుడు, సత్యవతి దంపతులు శత్రువుల చేతిలో వంద మంది కుమారులను పోగొట్టుకోగా శ్రీలక్ష్మీదేవి అనుగ్రహించి సత్యవతి కడుపున తానే కూతురుగా జన్మిస్తుంది. ఆ శిశువును చూసి దేవతలు, మునులు చల్లగా బతకమంటూ 'బతుకమ్మ' అని దీవిస్తారు. శ్రీమహావిష్ణువు చక్రాంగుడనే పేరుతో జన్మించి రాజు వేషంలో వచ్చి బతుకమ్మను పెళ్లి చేసుకొని సిరిసంపదలతో, సంతానంతో సుఖంగా ఉన్నారనే కథ ప్రచారంలో ఉంది.

■ మరో కథలో గౌరీదేవి మహిషాసురుడిని వధించాక అలసి అశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు సొమ్మసిల్లి పడిపోతుంది. ఆమెను స్పృహలోకి తేవడానికి మహిళలందరూ దేవిని బతుకమ్మ అని ప్రార్థిస్తూ పాటల రూపంలో వేడుకోగా దశమి రోజున తేరుకుంటుంది. నాటి నుంచి ఆమెను బతికిన అమ్మ, బతుకమ్మగా కొలుస్తున్నారని ప్రచారంలో ఉంది.

ఇక్కడి ఆడపిల్లల సొత్తు



భారతీయ సంస్కృతిలో మహిళకు అత్యంత గౌరవ స్థానం ఉంది. ఇది మనకు పురాణాలు, గ్రంథాల ద్వారా నిరూపితమైంది. సీతారాములు, రాధాకృష్ణులు, పార్వతీపరమేశ్వరులు.. ఇలా స్త్రీ దేవతలతో కూడిన గీతాలను బతుకమ్మ పాటలుగా పాడుకుంటాం. నా చిన్నతనంలో విన్న మంచి పాటలు నేడు కనుమరుగయ్యాయి. సంస్కృతిని భావి తరాలకు అందించాలన్న ఉద్దేశంతో కొన్నింటిని సేకరించాను. ప్రస్తుత కాలానికి అనుగుణంగా మార్పులు చేసి పుస్తక రూపంలో తీసుకొచ్చా. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలోని చాలా ప్రాంతాలు తిరిగి బహుళ ప్రాచుర్యంలో ఉన్న వాటిని తీసుకున్నా. తెలంగాణ ప్రాంతంలో పుట్టిన ఆడబిడ్డల సొత్తు ఈ పాటలు.

– డా.అడువాల సుజాత, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు

ఆకాంక్షను ఇనుమండింపజేసేలా..



బతుకమ్మ పాటల స్ఫూర్తితో సుదీర్ఘ తెలంగాణ ఉద్యమంపై బతుకమ్మ పాట రాశాను. ఇందులో రాష్ట్ర భౌగోళిక పరిస్థితులు, జిల్లాల వారీగా వనరులు, ఇక్కడి ప్రజల సమస్యలను, ఆకాంక్షను వివరించా. అన్ని అంశాలను ఇనుమడింపజేసేలా పాటగా తీసుకొచ్చా. ఇందుకు నా భర్త లక్ష్మీనారాయణ సహకారం తీసుకున్నా.

– సబ్బని శారద, కరీంనగర్

మూడు జిల్లాల్లో సేకరించా..



వందల ఏళ్ల కిందటి బతుకమ్మ పాటలు అర్థవంతంగా ఉండేవి. బతుకమ్మ ఆట అతివలకు మంచి వ్యాయామం కూడా. నేను పౌరాణిక గీతాలు, పెళ్లి పాటలు, మంగళహారతులు వంటి పాటలు రాశా. ఈ ప్రాంత మహిళలకు ఎంతో ఇష్టమైన బొడ్డెమ్మ, బతుకమ్మ పండుగల సంస్కృతి బతికించడానికి పాటలు సేకరించా. కరీంనగర్, వరంగల్, నల్గొండ ప్రాంతాల్లో పని చేసినపుడు బతుకమ్మ పాటలు సేకరించి పుస్తకంగా తీసుకొచ్చా. అమెరికాలోని తెలుగువారు పండుగ వేళ ఎంతో ఇష్టంగా పాడుకుంటున్నారు. ఇప్పటి పిల్లలు డీజేలు, రికార్డింగ్ పాటలపై వేస్తున్న గెంతులు చూసి మా తరం వారికి బాధనిపిస్తోంది.

– డా.ఆర్.కమల, విశ్రాంత అధ్యాపకురాలు



ప్రశాంత జీవనం అవగాహనే ప్రధానం

నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం, రాయికల్

తరచూ అనవసర ఆందోళనలకు గురికావడం, ఒంటరిగా ఉండటం, మతిమరుపు ఇలాంటి అనేక సమస్యలు మానసిక అనారోగ్యం జాబితాలోనివే. శారీరకంగా ఎంత ఆరోగ్యకరంగా ఉన్నా. మానసిక ప్రశాంతత లేకపోతే జీవనయానం గతి తప్పుతుంది. దీర్ఘకాలిక రుగ్మతలకు దారి తీస్తుంది. ఇలా అనేక మానసిక సమస్యలు, నివారణపై అవగాహన కలిగించేందుకు ఏటా అక్టోబరు 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య సంస్థ 1992 నుంచి ఏటా ఒక్కో నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. 2024లో 'పని ప్రదేశాల్లో మానసిక ఆరోగ్యం' నినాదంతో ముందుకొచ్చింది.



ఖని ప్రభుత్వ ఆసుపత్రిలోని మానసిక వైద్య విభాగం

ప్రత్యేక వైద్య విభాగాలు..: మానసిక సమస్యలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా వైద్య విభాగాలను ఏర్పాటు చేసి చికిత్సను అందుబాటులోకి తెచ్చారు. మద్యం, ధూమపానం, మత్తు పదార్థాలకు అలవాటుపడిన వారిని సైతం వాటి నుంచి దూరంచేసి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకు ఆయా విభాగాలు కృషి చేస్తున్నాయి.

■ గతేడాది నుంచి ఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో మానసిక వైద్య విభాగం సేవలందిస్తుంది. సాధారణ సమస్యలతో వచ్చే వారికి ఓపీలోనే వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చి పంపిస్తుండగా.. తీవ్రత ఉన్న వారిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకొని చికిత్స చేస్తున్నారు.

2024 మార్చి నుంచి ఖనిలో ఓపీ తీరు	నెల	మార్చి	ఏప్రిల్	మే	జూన్	జులై	ఆగస్టు	సెప్టెంబర్
	ఓపీ	153	133	166	144	153	109	153

ఈ లక్షణాలుంటే..

■ స్కిజోఫ్రీనియా: వారిలో వారే మాట్లాడుకోవడం, నవ్వుకోవడం, ఎదుటివారు తనకు హాని చేస్తారేమోనని అనుమానంతో ఆందోళనకు గురికావడం.

■ కుంగుబాటు: తమను తామే నిందించుకోవడం, చేస్తున్న పనిపై ఆసక్తి కనబరచకపోవడం, త్వరగా అలసిపోవడం, తమను తాము గాయపరుచుకోవడంతో పాటు ఆత్మహత్యలకు యత్నించడం.

■ ఓసీడీ: ఆబెస్సివ్ కంపల్సివ్ డిసార్డర్(ఓసీడీ) లక్షణాలున్న వారు చేసిన పనినే మళ్లీ మళ్లీ చేస్తుంటారు. ఒకటే ఆలోచనను పదే పదే చెబుతుంటారు. ఉదాహరణకు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్తున్నా మళ్లీ వెనక్కి వచ్చి సరిచూసుకుంటారు.

■ చిన్నపిల్లలు: ప్రధానంగా చిన్నపిల్లలు అటెన్షన్ డెఫిషిట్ హైపరాక్టివిటీ డిసార్డర్(ఏడీహెచ్‌డీ), ఆటిజం తదితర మానసిక సమస్యలకు లోనవుతుంటారు. చదువుపై ఆసక్తి కనబరచకపోవడం, మిగతా పిల్లలతో కలవకుండా ఉండటం తదితర లక్షణాలు.

ముందస్తుగా గుర్తిస్తేనే నివారణ

మానసిక సమస్యలను ముందస్తుగా గుర్తిస్తేనే ప్రాథమిక స్థాయిలో నివారించవచ్చు. వ్యక్తి ప్రవర్తనలో మార్పులను గమనించే కుటుంబ సభ్యులు వారికి చికిత్స ఇప్పించడంలో కీలకం. గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో మానసిక వైద్య విభాగంలో వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. వ్యాధి తీవ్రంగా ఉన్నవారికి ఇన్‌పేషెంట్లుగా చేర్చుకొని చికిత్స చేస్తున్నాం.

- రవివర్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్(మానసిక వైద్యం) ప్రభుత్వ వైద్య కళాశాల, ఖని

తమ్ముడిని చంపిన అన్న


చంద్రయ్య

శంకరపట్నం (సైదాపూర్), న్యూస్‌టుడే : కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం దుద్దెనపల్లిలో దారుణం చోటు చేసుకుంది. అన్న చేతిలో తమ్ముడు హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. దుద్దెనపల్లికి చెందిన కుందేళ్ల ప్రేమలత- రాజయ్య దంపతులకు ఇద్దరు కుమారులు కుమారస్వామి, చంద్రయ్య (31) ఉన్నారు. తండ్రి రాజయ్య ఉపాధి కోసం సుమారు అయిదేళ్ల కిందట దుబాయ్‌కు వెళ్లాడు. తల్లితోపాటు ఇద్దరు కుమారులు ఉంటున్నారు. కుమారస్వామి వివాహితుడు కాగా, చంద్రయ్యకు వివాహం కాలేదు. ఇద్దరు సొంత వ్యవసాయం చూసుకోవడంతోపాటు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తారు. అన్నదమ్ముళ్ల మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం అర్ధరాత్రి చంద్రయ్య మద్యం తాగి వచ్చి అన్న కుమారస్వామితో గొడవకు దిగాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. వీరిద్దరిని ఆపేందుకు తల్లి ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఆవేశంలో కుమారస్వామి అక్కడే ఉన్న ఇనుపరాడ్‌తో దాడి చేయగా చంద్రయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకొన్న హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ, పట్టణ సీఐ తిర్మల్ గౌడ్, ఎస్సై తిరుపతి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గ్రామస్థులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్నదమ్ముల మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఆ క్రమంలోనే తమ్ముడిని హత్య చేసినట్లు పంచాయతీ కార్యదర్శి రావుల శ్రీనివాస్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన

జగిత్యాల వ్యవసాయం : ఉమ్మడి జిల్లాలో రాగల నాలుగు రోజుల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షసూచన ఉందని పొలాస పరిశోధనస్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. గాలిలోతేమ 59-94 శాతం, ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా 22-23, గరిష్ఠంగా 32-34 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతాయని వివరించారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న వాహనం


కొండగట్టు సమీపంలో బోల్తా పడ్డ వ్యాను

మల్యాల, న్యూస్‌టుడే: ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి వ్యాను అదుపుతప్పి చెట్టును ఢీకొని బోల్తాపడింది. ఈ సంఘటన మల్యాల మండలం ముత్యంపేట పరిధిలోని కొండగట్టు ప్రాంతంలో జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. వంటనూనె ప్యాకెట్లలోడ్‌తో కామారెడ్డి నుంచి మంచిర్యాల వెళ్తున్న డీసీఎం వ్యాను కొండగట్టు ప్రాంతంలోని మారుతిటౌన్ షిప్ సమీపంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపుతప్పి రహదారి పక్కనున్న చెట్టును ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవరు నర్సింహులు క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో దాదాపు గంటసేపు ఇబ్బంది పడ్డారు. మల్యాల ఎస్సై నరేష్, జగిత్యాల అగ్నిమాపక అధికారి కృష్ణకాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని క్యాబిన్‌ను కత్తిరించి డ్రైవరును బయటకు తీసి చికిత్స కోసం 108లో జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. మల్యాల పోలీసులు రహదారిపై ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఎల్ఎఫ్‌జి మధు, ఆపరేటర్ మల్లేశం, ఫైర్‌మ్యాన్లు వేణు, రాజేందర్ పాల్గొన్నారు.

అశ్వవాహనంపై ఊరేగిన స్వామివార్లు



ఉత్సవ మూర్తుల పెద్ద సేవలో అర్చకులు, భక్తులు: కాళరాత్రి అలంకారంలో అమ్మవారు

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో శ్రీ దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు కాలరాత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, శ్రీరాజరాజేశ్వరిదేవికి చతుష్షష్టి పూజలను ఘనంగా నిర్వహించారు. నాగిరెడ్డి మండపంలో గాయత్రి జపం, చండీ హోమం, గాయత్రి హవనాన్ని అర్చకులు వేద మంత్రోచ్చారణలతో జరిపించారు. మూల నక్షత్రం సందర్భంగా పుస్తక రూపిణి మహా సరస్వతి అమ్మవారికి, బాల త్రిపుర సుందరి దేవికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి శ్రీ రాజరాజేశ్వరస్వామి, శ్రీలక్ష్మీ సమేత అనంత పద్మనాభస్వామివార్ల ఉత్సవమూర్తులకు వేద పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద సేవ నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పట్టణంలోని ప్రధాన వీధుల్లో అశ్వవాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఏఈవో శ్రీనివాస్, అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణపై అమ్మాయిల ఆసక్తి

న్యూస్‌టుడే, సిరిసిల్ల (విద్యానగర్)


కర్రసాములో శిక్షణ పొందుతున్న బాలికలు

ప్రస్తుత సమాజంలో మహిళలపై నానాటికీ అఘాయిత్యాలు పెరుగుతున్నాయి. బాలికలు, యువతులు, మహిళలు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకునే వరకు కుటుంబీకులకు ఆందోళన తప్పడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో తమను తాము రక్షించుకునేందుకు మార్షల్ ఆర్ట్స్ ఎంతో అవసరం. అనుకోని సంఘటనలు ఎదురైనప్పుడు మహిళలు ఆత్మరక్షణ చర్యలు చేపట్టాలి. అందుకుగాను మార్షల్ ఆర్ట్స్ ప్రాధాన్యతను తెలియజేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం 'హర్ ఘర్ దుర్గా' పేరుతో నవరాత్రుల సమయంలో ఉచితంగా శిక్షణ అందిస్తోంది.

సిరిసిల్లలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో 'హెల్పింగ్ హార్ట్స్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కర్రసాములో ఉచిత శిక్షణ అందిస్తున్నారు. పదిహేనురోజుల పాటు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు నేర్పుతున్నారు. 12 సంవత్సరాల బాలికల నుంచి 25 ఏళ్ల మహిళలు, యువతులు ఇందులో పాల్గొనవచ్చు. మొత్తం 60 మంది ఈ శిక్షణ పొందుతున్నారు. ఈ నెల 3న ప్రారంభమైన ఈ శిక్షణ 21 వరకు కొనసాగుతుంది. ఇందులో ప్రావీణ్యం పొందడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు ఆత్మస్థైర్యం పొందుతారు. తమను తాము రక్షించుకోగలమనే ధైర్యం ఏర్పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

చాలా సంతోషంగా ఉంది - శ్రీనిజ



నేను సిరిసిల్లలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాను. కర్రసాములో శిక్షణ పొందడం చాలా ఆనందంగా ఉంది. శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం ఏర్పడుతుంది. ఏకాగ్రత పెరుగుతుంది.

ఆత్మస్థైర్యం పెరుగుతుంది - సంజన



నేను ఆసిఫాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. పండగ సెలవులకు ఇంటికి వచ్చాను. హెల్పింగ్ హార్ట్స్ వారు ఉచితంగా కర్రసాము శిక్షణ అందించడం హర్షణీయం. కఠిన పరిస్థితుల్లోనూ మనల్ని మనం రక్షించుకోగలమనే ఆత్మస్థైర్యం ఏర్పడుతుంది.

ఎంతో అవసరం



బాలికలు, మహిళలపై రోజురోజుకీ అఘాయిత్యాలు పెరుగుతున్నాయి. అందుకే ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం. 60 మంది మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు.

- కనుకుంట్ల పున్నంచందర్, హెల్పింగ్ హార్ట్స్ అధ్యక్షుడు

సద్వినియోగం చేసుకోవాలి - వొడ్నాల శ్రీనివాస్, శిక్షకుడు



బాలికలు, మహిళలు ఉచిత కర్రసాము శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల అనేక లాభాలున్నాయి. శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. జీవితంలో కఠిన పరిస్థితులను ఎదుర్కొనేలా ఇవి మనల్ని తయారు చేస్తాయి.

ఎస్సారెస్పీకి పెరిగిన వరద

జగిత్యాల ధరూర్‌క్యాంపు: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం సాయంత్రం వరకు వరద 52,830 క్యూసెక్కులకు పెరిగింది. 10 స్పిల్‌వే గేట్లను తెరచి 31,240 క్యూసెక్కుల మిగులు జలాలను గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ఎస్కేప్‌గేట్ల ద్వారా 1,200 క్యూసెక్కులను గోదావరిలోకి మళ్లిస్తుండగా వరదకాలువకు 12 వేల క్యూసెక్కుల నీటిని వదిలి మధ్యమానేరు జలాశయానికి తరలిస్తున్నారు. ఇతర కాలువలు, ఎత్తిపోతలు కలుపుకుని మొత్తం ఔట్‌ఫ్లో 52,380 క్యూసెక్కులుగా ఉంది.